# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# కథ పేరు: కౌంట్ డౌన్
## { డేవిడ్ ఈలై కథకి స్వేచ్ఛానువాదం }

**మెటెరాలజిస్ట్లు** వాతావరణాన్ని సరిగ్గా అంచనా వేసారు. ఆ రోజు అంతా సక్రమంగా జరుగుతోందని ప్రాజెక్ట్ హెడ్ సంతృప్తిగా ఉన్నాడు. అంతరిక్ష నౌక టేకాఫ్‌ని చూడటానికి వేలమంది అక్కడికి వచ్చారు. ఆహ్వానింపబడ్డవాళ్ళకి ప్రత్యేకసీట్లు. మిగిలినవారు వాటి వెనక నిలబడి చూస్తున్నారు. ఆ ఇంటర్నేషనల్ స్పేస్ ఇయర్‌కి అమెరికానించి మార్స్‌కి మనిషిని పంపుతున్నారు. ఆహ్వానితుల్లో కొన్ని దేశాల రాజకుటుంబాలు, మంత్రులు, రాజకీయవేత్తలు, ఉన్నత ప్రభుత్వాధికారులు ఉన్నారు.

"జీరో ప్లస్ ఒన్ అవర్!" లౌడ్ స్పీకర్లోంచి వినిపించింది.

రాకెట్ సెంటర్లోని బిల్డింగ్‌లో శాస్త్రజ్ఞులంతా తమ తమ సీట్లలో కూర్చుని ఎదురుగా ఉన్న కంప్యూటర్ మానిటర్లని శ్రద్ధగా గమనిస్తున్నారు. ఆ టీమ్ లోని ఒకరు ఫిజిసిస్ట్ లూకాస్. గత ఐదేళ్ళుగా అతను పోషకాహారాన్ని కుదించే అనేక పరిశోధనలు చేస్తున్నాడు. అంతరిక్షంలోకి వెళ్ళే వ్యోమగాములు ఎక్కువ బరువుగల ఆహారాన్ని తీసుకువెళ్ళలేరు. వంట సౌకర్యం కూడా నౌకలో ఉండదు. కాబట్టి వారు మింగే అన్ని విటమిన్స్, మినరల్స్, మాంసకృత్తులు, కొవ్వు, పిండిపదార్ధాలుగల గుళికలని లూకాస్ రూపొందించాడు. వాటిని వాళ్ళు చప్పరించైనా తినొచ్చు. లేదా మింగచ్చు. అతను కొత్తగా రూపొందించిన గుళికలని ఆ అంతరిక్ష నౌకలో పంపుతున్నారు.

లూకాస్ భార్య సారా బయట ప్రేక్షకుల్లోని ఆహ్వానితుల కుర్చీల్లో ఓ దాంట్లో కూర్చుని ఉంది. ఆమె చుట్టుపక్కల ఉన్న మహిళలంతా కూడా ఆమెలా ఆ ప్రాజెక్ట్‌లో పనిచేసే శాస్త్రజ్ఞుల భార్యలే. సారాకి మనసంతా బాధగా ఉంది. అందుకు కారణం కెప్టెన్ రెండెజో. ఇంకొద్దిసేపట్లో అతను అంతరిక్షంలోకి వెళ్ళి కొన్నేళ్ళ తర్వాత కాని తిరిగిరాడు. అప్పటికే అతను ఆ నౌకలో ఉన్నాడు.

సారాకి, రెండెజోకి అక్రమసంబంధం ఉంది. లూకాస్‌కి రెండెజో పూర్తిగా వ్యతిరేకం. లూకాస్ పనే ముఖ్యం అనుకునే మనిషి, జీవితంలో ఆనందాలని అనుభవించే సమయంలో మానవాళికి ఉపయోగపడేవి పరిశోధించి కనిపెట్టాలని, అదే తన జీవిత పరమార్ధం అని భావిస్తాడు. రెండెజో పనిని ఆదాయం తెచ్చేదిగా మాత్రమే చూస్తూ, జీవితం ఆనందించడానికే అనుకుని అలా ప్రవర్తిస్తూంటాడు.

కెప్టెన్ రెండెజో తెలివిగలవాడు. తొలిసారి మార్స్ మీదకి మనిషిని పంపడానికి ఎంపికైన రెండో జాబితాలోని 50మంది నించి అతనే ఎన్నికయ్యాడు. తమ అక్రమ సంబంధం గురించి లూకాస్‌కి తెలీకుండా రెండెజో జాగ్రత్తపడ్డాడు. లేదా అది తన కెరీర్ని దెబ్బతీసి, తన స్థానంలో మరొకర్ని పంపుతారని భయపడ్డాడు. స్పీకర్లో మళ్ళీ ప్రకటన వినిపించింది.

"జీరో ప్లస్ థర్టీ."

రెండెజో కేబిన్ టెంపరేచర్ని తణిఖీ చేసాడు. బయలుదేరడానికి అరగంటముందు తణిఖీ చేయాల్సినవన్నీ ఇన్‌స్ట్రుమెంటల్ పేనల్‌లో తణిఖీ చేసి వైర్‌లెస్ ద్వారా ఆ సమాచారాన్ని కమాండ్ సెంటర్‌కి తెలియచేసాడు. జీరో అవర్ దగ్గరయ్యేకొద్దీ శాస్త్రజ్ఞుల్లో మానసిక వత్తిడి అధికం కాసాగింది. కొన్ని లక్షల భాగాల్లో ఒక్కటి, ఏ ఒక్కటి సరిగ్గా పనిచేయకపోయినా టేకాఫ్ జరగక మునుపే అంతరిక్ష నౌక పేలిపోవచ్చు. ఒకోసారి నేలమీదే. ఒకోసారి ఆకాశంలో కొద్ది దూరం ప్రయాణించాక.

"లూకాస్ స్పీకింగ్" లూకాస్ ఫోన్‌లో చెప్పాడు.

ప్రాజెక్ట్ డైరెక్టర్ కంఠం వినగానే వినిపించింది.

"మీ విభాగంలో అంతా సవ్యంగా జరిగిందా? ఇబ్బందులేం లేవని అనుకుంటున్నాను."

"అంతా సవ్యంగా ఉంది."

ప్రాజెక్ట్ డైరెక్టర్ మరికొన్ని విభాగాల హెడ్స్‌కి ఫోన్ చేసి అదే ప్రశ్నని అడిగి అదే జవాబు వచ్చాక తృప్తిపడ్డాడు.

"కేబిన్ టెంపరేచర్ ఎలా ఉంది రెండెజో?" ఆయన అంతరిక్ష నౌకలోని రెండెజోని ప్రశ్నించాడు.

"ఇరవై ఐదు సెంటిగ్రేడ్."

"గుడ్."

అది సరిగ్గా లేకపోతే అతను చలికి గడ్డకడతాడు. లేదా అన్నంలా ఉడికిపోతాడు.

డైరెక్టర్ ఫ్యూయల్ హెడ్‌తో ఇతర హెడ్స్‌తో మాట్లాడి వాళ్ళనించి తమ విభాగాల్లో అంతా సవ్యంగా ఉందని హామీ తీసుకున్నాడు. మళ్ళీ లౌడ్ స్పీకర్లో వినపడింది.

"జీరో అవర్ ప్లస్ ఫిఫ్టీన్ మినిట్స్."

డాక్టర్ ఏండర్స్ రెండెజో బిపిని, గుండె కొట్టుకునే వేగాన్ని, మానిటర్లో నృత్యంచేసే ఆకుపచ్చరంగు గీతలని చూసి ప్రాజెక్ట్ హెడ్‌కి చెప్పాడు.

"రెండెజో స్టేబుల్‌గా ఉన్నాడు."

లాంచింగ్ పేడ్ దగ్గర కొందరు శాస్త్రజ్ఞులు చెక్ లిస్ట్‌లో వేగంగా పెన్సిల్‌తో టిక్ చేస్తున్నారు.

జీరో ప్లస్ టెన్ ప్రకటించగానే వారంతా జీప్స్ ఎక్కి లాంచింగ్ పేడ్‌నించి బయలుదేరారు. అంతరిక్ష నౌక సమీపం నించి వచ్చే ఆ ఆరు జీపులని చూడగానే అంతా ఇక అది బయలుదేరబోతోందని గ్రహించారు.

సారా ఆ నౌక వంకే చూస్తోంది. అందులో రెండెజో తన గురించి ఆలోచిస్తున్నాడా? బహుశా టేకాఫ్ విషయంలో బిజీగా ఉంటాడు. ఆమెకి కొద్ది దూరంలోనే నలుగురు నోబుల్ ప్రైజ్ గ్రహీతలు కూర్చుని ఉన్నారు. కొందరు వారినించి ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటున్నారు. ఆమె మనఃస్థితి  సాధరణంగా ఉండి ఉంటే ఆ పనే చేసేది.

ప్రాజెక్ట్ డైరెక్టర్ జాబితాలోని ఆఖరి చెక్ లిస్ట్ ముందు టిక్ చేయసాగాడు. న్యూట్రిషనల్ కెమిస్ట్రీ ముందు టిక్ పెట్టుకున్నాడు.

"జీరో త్రి మినిట్స్."

స్పీకర్లో వినిపించగానే ప్రేక్షకుల్లోంచి గుసగుసలు వినపడసాగాయి. ఏ ఒక్క విభాగం హెడ్ అయినా ఆ నౌక అంతరిక్షంలోకి వెళ్ళకుండా కిల్ అనే బటన్‌ని నొక్కి ఆపగలడు. కాని ఎన్నో కోట్ల డాలర్లు ఆ ఒక్క బటన్ వల్ల వృథా అయిపోతాయి. తిరిగి ఆ నౌకని పంపడానికి కొన్ని నెలలు పడుతుంది. నౌకలోని అనేక పరికరాలు పనికిరాకుండా పోతాయి.

జీరో టెన్...నైన్..ఎయిట్...స్పీకర్లోంచి వినపడే అంకెలని ప్రేక్షకులు కూడా గట్టిగా చెప్పసాగారు.

"...త్రి...టూ...ఒన్....జీరో."

అందరి దృష్టి ఆ నౌకమీదే ఉంది. తక్షణం భూమి కొద్దిగా కంపించింది. పెద్ద శబ్దంతోపాటు నిప్పులు చిమ్ముతూ ఆ నౌక చాలా నెమ్మదిగా పైకి లేచింది. క్రమేపి అది వేగం అందుకుని పైకి దూసుకుపోసాగింది.

"టేకాఫ్ సక్సెస్" వినిపించగానే అంతా చప్పట్లు కొట్టారు.

శాస్త్రజ్ఞులు కూడా లేచి చప్పట్లు కొట్టి, ఒకరితొ మరొకరు కరచాలనం చేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేసారు. అది కనపడేంతవరకూ ప్రేక్షకులు తల ఎత్తి వెళ్తున్న దాన్ని చూస్తూనే ఉన్నారు.

"స్టేజ్ ఒన్ సక్సెస్‌ఫుల్. స్టేజ్ ఒన్ సక్సెస్‌ఫుల్" స్పీకర్లోంచి కొద్దిసేపటికి వినిపించింది.

సారా పైకి చూస్తూ చేతిని ఊపుతూంటే ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు కారసాగాయి. అంతా అది ఆనందం వల్ల అని భావించారు. ఆమె దుఃఖించడానికి కారణం ఆమె భర్తకి తప్ప ఇంకెవరికీ తెలీదు.

అతనికి తమ అక్రమ సంబంధం గురించి తెలుసని ఆమెకీ తెలీదు.

నాలుగు గంటలు గడిచాయి. కెప్టెన్ రెండెజో వైర్‌లెస్‌లో గ్రౌండ్ కంట్రోల్‌తో మాట్లాడుతూనే ఉన్నాడు.

నలభై రోజుల తర్వాత కూడా.

నలభై ఒకటో రోజు గ్రౌండ్ కంట్రోల్‌కి రెండెజోనించి కమ్యూనికేషన్ అకస్మాత్తుగా ఆగిపోయింది.

"హలో కెప్టెన్ రెండెజో. కెన్ యు రీడ్‌మి? హలో. కెప్టెన్ రెండెజో...: "

ఎంతసేపు ప్రయత్నించినా వారికి అంతరిక్ష నౌక నించి జవాబు రాలేదు.

సరిగ్గా ఆరోజే లూకాస్ పుట్టినరోజు. అతను ఆ రాత్రి ఓ హోటల్‌లో డిన్నర్ పార్టీకి హాజరయ్యాడు. అతను తన పుట్టినరోజునే రెండెజోని చంపే ఏర్పాటు చేసాడని ఎవరికీ తెలీదు. ఆరోజు అతను తినే గుళికలో సైనేడ్ ఉండేలా లూకాస్ ఏర్పాటు చేసాడని కూడా ఎవరికీ తెలీదు. సారాకి కూడా. రెండెజో శవాన్ని డాక్టర్ ఏండర్స్ పరీక్షించి మరణ కారణం తెలుసుకునే అవకాశంకూడా రాదు. రెండెజో జీవించి లేకపోతే ఇక వెనక్కి తిరిగిరాడు. ఆ నౌక అంతరిక్షంలోనే తిరుగుతూంటుంది.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments